ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
మంగళవారం 11 ఆగస్టు, 2026 | సంపుటి - 01 సంచిక - 363 | పేజీలు -06 వెల - 5



# 71లక్షల ఓట్లపై ఉత్కంఠ!

**ముగిసిన ఎస్ఐఆర్ కీలక ఘట్టం**

**3.38 కోట్ల ఓటర్లలో 70.8 లక్షలు 'అన్‌కలెక్టబుల్'**

**హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డిలోనే 41.5 లక్షలు**

**ఉత్తర, పశ్చిమ తెలంగాణలో అధిక 'అనామలీస్'**

**2.64 కోట్ల ఫారాల డిజిటైజేషన్.. ధ్రువీకరణ పూర్తి**

**తుది జాబితాలో ఎంతమంది మిగులుతారు.. ఎంతమంది గల్లంతవుతారు?**




కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో కీలక ఘట్టం ముగిసింది. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఇచ్చిన గడువు నేటితో ముగియడంతో.. రాష్ట్రంలోని సుమారు 71 లక్షల మంది ఓటర్ల భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లలో 70.8 లక్షల మంది 'అన్‌కలెక్టబుల్' కేటగిరీలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో 43 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినవారు, 10.3 లక్షల మంది గైర్హాజరు లేదా ఆచూకీ లభించనివారు, 9.1 లక్షల మంది మరణించిన వారు, 6.6 లక్షల మంది డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు ఈ మొత్తం అన్‌కలెక్టబుల్ ఓటర్లలో 58.6 శాతం.. అంటే దాదాపు 41.5 లక్షల మంది హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉండటం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక అందిన ఫారాల పరిశీలన, డేటా ధ్రువీకరణ, అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలన పూర్తయిన తర్వాత తుది ఓటర్ల జాబితాలో ఎంతమంది పేర్లు కొనసాగుతాయి.. ఎంతమంది తొలగింపునకు గురవుతారన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

**71 లక్షలపై తుది వేటు?**

ఎస్ఐఆర్‌లో భాగంగా అన్‌కలెక్టబుల్ కేటగిరీలో గుర్తించిన ఓటర్ల పేర్లను తొలగించే ప్రక్రియ ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ. సుదర్శన్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే గడువు ముగిసినప్పటికీ మరిన్ని ఎన్యూమరేషన్ ఫారాలు అందే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ప్రస్తుతం గుర్తించిన 70.8 లక్షల సంఖ్యే తుది తొలగింపుల సంఖ్య కాదని స్పష్టమవుతోంది. అందిన ఫారాల పరిశీలన, వివరాల ధ్రువీకరణ, అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కారం వంటి దశలు పూర్తయిన తర్వాతే తుది జాబితాపై స్పష్టత రానుంది. దీంతో ప్రస్తుతం 'అన్‌కలెక్టబుల్'గా ఉన్న ప్రతి ఓటు తుది జాబితాలో కొనసాగుతుందా? లేక సంబంధిత పరిశీలన అనంతరం తొలగిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

**గ్రేటర్‌లోనే 41.5 లక్షలు**

అన్‌కలెక్టబుల్ ఓటర్ల సంఖ్యలో గ్రేటర్ హైదరాబాద్ పరిధి జిల్లాలే ముందున్నాయి. హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో కలిపి సుమారు 41.5 లక్షల అన్‌కలెక్టబుల్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70.8 లక్షలతో పోలిస్తే ఇది దాదాపు 58.6 శాతం. పట్టణ ప్రాంతాల్లో ఓటర్లను గుర్తించడంలో ఎదురైన ఇబ్బందులు ఇందుకు ప్రధాన కారణాలుగా ........(తరువాయి 2లో)

# పెద్ది అంటే వ్యక్తి కాదు..శక్తి!



- ఉద్యమ సహచరుడిగా పెద్ది అనుబంధాన్ని గుర్తుచేసుకున్న హరీశ్‌రావు
- పెద్ది జన్మ ధన్యమైంది.. అలాంటి జనాభిమానాన్ని చూడలేదు
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పెద్ది పేరుతో మెమోరియల్ ఆస్పత్రి
- గద్దె కూల్చినా.. ప్రజల గుండెల్లోంచి పెద్ది జ్ఞాపకాలను చెరపలేరు
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. నేతల భావోద్వేగ ప్రసంగాలు

కాకతీయ, నల్లబెల్లి : ''పెద్ది అంటే ఒక వ్యక్తి కాదు.. ఒక శక్తి'' అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నెలల తరబడి కలిసి పనిచేసిన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ.. ప్రజల కోసం, తెలంగాణ కోసం పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన పోరాటాన్ని కొనియాడారు. మాజీ మంత్రి కేటీఆర్ సైతం పెద్ది సుదర్శన్‌రెడ్డికి దక్కిన ప్రజాభిమానాన్ని ........(తరువాయి 2లో)



# ఇళ్ల పంపిణీలో రగడ



- మంత్రుల వ్యాఖ్యలపై కౌశిక్‌రెడ్డి ఆగ్రహం 4లో..
- జై కాంగ్రెస్.. జై కేసీఆర్ నినాదాలతో ఉద్రిక్తత
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన పరిస్థితి

సుద్దాల చిన్నారి

# అరుదైన ఘనత

- 12 ఏళ్లకే ప్రకృతి బ్లెస్సీ ప్రపంచ రికార్డు
- హై రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- ప్రకృతి పరిరక్షణకు మూడు రాష్ట్రాల్లో 2.65 లక్షల విత్తనాలు 5లో..




హై రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో ప్రకృతి బ్లెస్సీ

కోరేకల్ ఇసుకలో

# అదనపు దందా!

**రసీదులో ఉన్నదానికంటే రూ.3,500 వరకు అదనం?**

**చార్జీలన్నీ అధికారికంగానే.. మరి ఈ వసూళ్లెందుకు?**

**35 టన్నులకు రూ.13,783 చెల్లించిన లారీ ఓనరు**

**రసీదు బయట వసూళ్లపై కాకతీయ చేతికి చిక్కిన వీడియోలు** 5లో..

**విచారిస్తున్నామని కాకతీయకు పీవో వివరణ**



# నిజామాబాద్‌లో 'పాంచజన్య సంకల్ప సభ'

- ఆగస్టు 26న కలెక్టరేట్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ
- సభ పర్యవేక్షకుడిగా డాక్టర్ రఘు నియామకం



2లో..




కేయూపై సర్కారుది

# చిన్నచూపేనా?

**ఓయూకు రూ.1,000 కోట్లు.. కేయూకు పైసా విదల్చరా?**

**ఉత్తర తెలంగాణకు విద్యా దిక్సూచి.. నిధుల విషయంలో మాత్రం నిర్లక్ష్యమా?**

**ఎన్నికల వేళ కేయూపై గొంతెత్తిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక మౌనమేలా?**

**గోల్డెన్ జూబ్లీ వేళ 'కుర్తా' డిమాండ్‌పై మొదలైన చర్చ**

**అభివృద్ధికి నిధులివ్వకుండా వర్సిటీని ఎలా బలోపేతం చేస్తారంటూ ప్రశ్నలు?**

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ఉత్తర తెలంగాణ విద్యా, సామాజిక ప్రగతిలో కీలక పాత్ర పోషించిన కాకతీయ విశ్వవిద్యాలయం పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1,000 కోట్ల భారీ నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో రెండో అతిపెద్ద యూనివర్సిటీగా ఉన్న కాకతీయ యూనివర్సిటీకి నిధులివ్వకుండా మొండి చేయి చూపుతుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. యాభై ఏళ్లుగా ఉత్తర తెలంగాణకు ఉన్నత విద్యను అందిస్తూ.. వేలాది మంది విద్యావంతులు, మేధావులు, ప్రజా సమస్యలపై ప్రశ్నించే గళాలను తీర్చిదిద్దిన వర్సిటీకి నిధుల విషయంలో ఎందుకీ చిన్నచూపు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గత ప్రభుత్వంపై ఎన్నికల సమయంలో ........(తరువాయి 2లో)

కాకర్ల సమత

# లొంగుబాటు

**నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో**

**ఎట్టకేలకు జనజీవన స్రవంతిలోకి సీనియర్ నాయకురాలు**

**పునరావాసానికి ప్రభుత్వం భరోసా..**

**ఆరోగ్య కార్డులు, ఉపాధి శిక్షణ, రుణాల సాయం**

**డీఐజీ సీవీ ఆనంద్ వెల్లడి** 3లో..




# కర్రెగుట్టల్లో చరిత్రాత్మక మార్పు!






రాష్ట్ర సరిహద్దు ప్రాంతం పాముసూరులో పర్యటిస్తున్న తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్

కాకతీయ, ములుగు ప్రతినిధి : ''కర్రెగుట్టలో చరిత్ర సృష్టించే రోజు ఇది.. దాదాపు 50 ఏళ్లుగా దట్టమైన అటవీ ప్రాంతం, మావోయిస్టుల భయంతో ప్రభుత్వ పరంగా ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఇకపై కర్రెగుట్ట ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలుకుతున్నాం'' అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. మావోయిస్టు ప్రభావం గణనీయంగా తగ్గడంతో ఇప్పటివరకు అభివృద్ధికి దూరంగా ఉన్న సరిహద్దు ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. కర్రెగుట్ట చుట్టుపక్కల గ్రామాలకు విద్య, వైద్యం, రహదారులు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాల పరిధిలోని కర్రెగుట్టల్లో పర్యటించిన డీజీపీ.. అంతర్రాష్ట్ర సరిహద్దులో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసు అధికారులు, భద్రతా బలగాలతో సరిహద్దు భద్రత, రహదారి నిర్మాణం, ఇరు రాష్ట్రాల సమన్వయంపై సమీక్ష నిర్వహించారు.

- 50 ఏళ్లుగా అడుగుపెట్టని ప్రాంతంలో తొలిసారి ప్రభుత్వ యంత్రాంగం
- మావోయిస్టు ప్రభావం తగ్గడంతో అభివృద్ధికి బాటలు
- రహదారి, విద్య, వైద్యం.. మౌలిక వసతులపై దృష్టి
- తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమన్వయంతో భద్రత కట్టుదిట్టం
- రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్.. కర్రెగుట్టల్లో పర్యటన
- సరిహద్దులో జాతీయ జెండా ఆవిష్కరించిన డీజీపీ

**50 ఏళ్ల తర్వాత ప్రభుత్వ అడుగు**

వాజేడు మండలంలోని మొరుమూరు, మిద్దువ మీదుగా వెంకటాపురం మండలంలోని పాముసూరు, జెల్ల ప్రాంతాల మీదుగా డోలి గ్రామానికి డీజీపీ చేరుకున్నారు. అక్కడి నుంచి తడపల గ్రామ సమీపంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి వెళ్లారు. జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, భద్రతా బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కర్రెగుట్ట ప్రాంతానికి తొలిసారిగా పోలీసు శాఖతో పాటు కలెక్టర్, ........తరువాయి 2లో

ఉత్తరం కాకతీయ

మంగళవారం 11 ఆగస్ట్, 2026 02

# కేయూపై సర్కారుది చిన్నచూపేనా?

(మొదటి పేజీ తరువాయి)

విద్యారంగం, విశ్వవిద్యాలయాల పరిస్థితిపై తీవ్ర విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కేయూ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించకపోవడంపై విద్యావర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేయూ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్ల అసోసియేషన్(కుర్తా) లేవనెత్తిన ఈ డిమాండ్ ఇప్పుడు సర్కారు వైఖరిపైనే చర్చకు దారితీస్తోంది. కేయూ అంటే కేవలం వరంగల్‌లోని ఓ విశ్వవిద్యాలయం కాదు. ఉత్తర తెలంగాణలో విద్యా చైతన్యానికి కేంద్రంగా ఎదిగిన సంస్థ. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది విద్యార్థులకు ఉన్నతవిద్యకు మార్గం చూపింది. అనేక మంది మేధావులను, అధ్యాపకులను, పరిశోధకులను, వివిధరంగాల్లో రాణించిన ప్రతిభావంతులను అందించింది. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గళాలకు వేదికగానిలిచింది. అలాంటివర్సిటీకినిధులు కేటాయించడంలో ప్రభుత్వం వెనుకంజవేయడంపైసహజంగానేప్రశ్నలుతలెత్తుతున్నాయి.

### ఓయూకు రూ.1,000 కోట్లు.. కేయూకు ఎందుకు ఇవ్వరు..?

ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి రూ.1,000 కోట్ల మేర నిధులు కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయం చర్చకు వచ్చిన నేపథ్యంలోనే కేయూ విషయంలోనూ ఇదే తరహా ప్రత్యేక కేటాయింపులు చేయాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. ఓయూకు భారీ నిధులు ఇవ్వడం అభినందనీయమే.. మరి కేయూకు కూడా అదే స్థాయిలో ప్రాధాన్యం ఎందుకు ఇవ్వకూడదు? అన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది. కేయూలో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు, పరిశోధనకు అనువైన వాతావరణం, ప్రయోగశాలల ఆధునికీకరణ వంటి అనేక అంశాలకు నిధులు అవసరమవుతున్నాయి. సాధారణ బడ్జెట్ కేటాయింపులతోనే అన్నింటినీ నెట్టుకురావడం సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గోల్డెన్ జూబ్లీ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్న డిమాండ్ బలపడుతోంది.

### ఎన్నికల వేళ ప్రశ్నలు.. ఇప్పుడు సమాధానాలెక్కడ?

గత ప్రభుత్వ పాలనలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించడంలో అప్పటి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అప్పట్లో ప్రభుత్వ విధానాలపై విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారుతుందని ఆశించిన కేయూ వర్గాలకు ఇప్పుడు ఎదురవుతున్నది ఏమిటి? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఎన్నికల సమయంలో కేయూ సమస్యలను ప్రస్తావించిన నాయకత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే వర్సిటీకి నిధుల విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తోందన్న చర్చ సాగుతోంది. రాజకీయ విమర్శలు చేయడం ఒకటైతే.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఆచరణలో చూపించడం మరో విషయం. కేయూ విషయంలోనూ అదే పరీక్ష ఇప్పుడు ప్రభుత్వానికి ఎదురైంది. గత ప్రభుత్వంపై చేసిన విమర్శలకు భిన్నంగా కాకుండా.. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వం నిరూపించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ఉత్తర తెలంగాణకు కేయూ చేసిన సేవ తక్కువేమీ కాదు

కాకతీయ విశ్వవిద్యాలయం ఐదు దశాబ్దాల ప్రస్థానంలో ఉత్తర తెలంగాణ విద్యా ముఖచిత్రాన్ని మార్చడంలో కీలక పాత్ర పోషించింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్నత విద్యా అవకాశాలు కేంద్రీకృతమైన కాలంలో.. వరంగల్‌లో విశ్వవిద్యాలయం ఏర్పాటవడం ఈ ప్రాంత విద్యార్థులకు గొప్ప అవకాశంగా మారింది. వేలాది కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు కేయూలో చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతోపాటు పరిశోధన, బోధన, రాజకీయ, సామాజిక రంగాల్లోనూ తమదైన ముద్ర వేశారు. విద్యార్థుల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలోనూ వర్సిటీ పాత్ర కీలకంగా నిలిచింది. అలాంటి సంస్థకు యాభై ఏళ్ల వేడుకల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చే సందేశం ఏమిటన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గోల్డెన్ జూబ్లీకి ఘనంగా వేడుకలు నిర్వహించడం మాత్రమేనా? లేక భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా నిధులు కేటాయించి వర్సిటీని బలోపేతం చేయడమా? అన్నదే అసలు ప్రశ్న.

### 'కుర్తా' డిమాండ్‌లో తప్పేముంది?

కేయూకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్న డిమాండ్‌ను కేవలం రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓయూకు భారీ నిధులు ఇచ్చే సమయంలో కేయూకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరడం సహజమైన డిమాండ్‌గానే విద్యావర్గాలు పేర్కొంటున్నాయి. ఉత్తర తెలంగాణకు విద్యా కేంద్రంగా ఉన్న వర్సిటీని అభివృద్ధి చేయడానికి నిధులు అడగడం తప్పా? అన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. ఒకవైపు రాష్ట్రంలోని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలకు భారీగా నిధులు కేటాయిస్తూ.. మరోవైపు కేయూకు ప్రత్యేకంగా నిధులు ఇవ్వకపోతే ప్రాంతీయ అసమానతల ఆరోపణలకు అవకాశం కల్పించినట్లవుతుందన్న అభిప్రాయం ఉంది. కేయూకు ఎంత నిధులు అవసరం? ఏయే పనులు చేపట్టాలి? ఎన్ని సంవత్సరాల్లో పూర్తి చేయాలి? అనే అంశాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు. యాభై ఏళ్ల చరిత్ర ఉన్న కేయూకు గోల్డెన్ జూబ్లీ కానుకగా నిధుల ప్యాకేజీ ఇస్తారా? లేక వేడుకలకే పరిమితం చేస్తారా? అన్నదే ఇప్పుడు ఉత్కంఠగా మారింది. ఎన్నికల సమయంలో కేయూ ప్రాధాన్యాన్ని గుర్తించిన కాంగ్రెస్ నాయకత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలకు ఆచరణ రూపం ఇస్తుందా? ఓయూకు రూ.1,000 కోట్లు ఇచ్చే ప్రభుత్వానికి కేయూ విషయంలో నిధుల కొరతేనా.. లేక చిన్నచూపేనా? అన్న ప్రశ్నకు సర్కారు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

## నిజామాబాద్‌లో 'పాంచజన్య సంకల్ప సభ'

### ఆగస్టు 26న కలెక్టరేట్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ

### సభ పర్యవేక్షకుడిగా డాక్టర్ రఘు నియామకం



కాకతీయ, నిజామాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక రాజకీయ కార్యక్రమానికి నిజామాబాద్ వేదిక కానుంది. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆగస్టు 26న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ గ్రౌండ్‌లో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చేలా పార్టీ శ్రేణులు కార్యాచరణ రూపొందిస్తున్నాయి. సభను విజయవంతం చేయాలని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత శ్రేణులకు సూచించినట్లు నిర్వాహకులు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేపట్టాలని ఆమె ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయడమే సభ లక్ష్యంగా చెబుతున్నారు. సభ నిర్వహణను పర్యవేక్షించేందుకు టీఆర్ఎస్ కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘును సభ పర్యవేక్షకుడిగా నియమించారు. ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా బాధ్యతలు అప్పగించి ఏర్పాట్లను సమన్వయం చేస్తున్నారు. సభకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. కలెక్టరేట్ గ్రౌండ్‌లో వేదిక, సభా ప్రాంగణం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ సభకు ప్రజలను సమీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. కరపత్రాలు, గోడపత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. సభ ద్వారా పార్టీ రాజకీయ బలాన్ని చాటడంతో పాటు ప్రభుత్వ విధానాలపై ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు వేదికగా మలచాలని నాయకత్వం భావిస్తోంది.

## ఇళ్ల పంపిణీలో రాజకీయ రగడ

### మంత్రుల వ్యాఖ్యలపై కౌశిక్‌రెడ్డి ఆగ్రహం

### జై కాంగ్రెస్.. జై కేసీఆర్ నినాదాలతో ఉద్రిక్తత

### పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన పరిస్థితి



కాకతీయ, కమలాపూర్ : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం రాజకీయ రగడకు దారితీసింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రసంగాలపై స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. కమలాపూర్, గూడూరు, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రులు ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రులు మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. నిలిచిపోయిన నిర్మాణాలను తమ ప్రభుత్వం పూర్తి చేసి అర్హులైన నిరుపేదలకు ఇళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మంత్రుల వ్యాఖ్యలపై కౌశిక్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఇది పేదలకు ఇళ్ల పంపిణీ కార్యక్రమమని, రాజకీయ వేదిక కాదని అన్నారు. ఇళ్ల పంపిణీలోనూ రాజకీయ విమర్శలు చేయడం సరికాదని, వాస్తవాలకు విరుద్ధమైన వ్యాఖ్యలు చేయవద్దని మండిపడ్డారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు జై కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు జై కేసీఆర్ అంటూ నినాదాలు చేయడంతో సభా ప్రాంగణం మార్మోగింది. ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత పెరగడంతో పోలీసులు అప్రమత్తమై వారిని శాంతింపజేశారు. అధికారిక కార్యక్రమంలో రాజకీయ విమర్శలు, నినాదాలతో ఉద్రిక్తతకు దారితీయడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

# 71లక్షల ఓట్లపై ఉత్కంఠ!

(మొదటి పేజీ తరువాయి)

కనిపిస్తున్నాయి. అద్దె ఇళ్లలో ఉండేవారు తరచూ నివాసాలు మార్చడం, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోవడం, మూసివేసిన ఇళ్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఓటర్లను గుర్తించడం కష్టంగా మారడం వంటి కారణాలతో అన్‌కలెక్టబుల్ కేసులు భారీగా నమోదైనట్లు తెలుస్తోంది. మరణించిన వారి పేర్లు కొనసాగడం, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉండటం వంటి అంశాలు కూడా ఇందులో భాగంగా ఉన్నాయి.

### ఉత్తర తెలంగాణలో 'అనామలీస్' కలకలం

మరోవైపు ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఓటర్ల వివరాల్లో 'అనామలీస్' అధికంగా నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు, అసమానతలు ఉన్నట్లు గుర్తించారు. జిల్లాల వారీగా ఆదిలాబాద్‌లో 28.5 శాతం, నిజామాబాద్‌లో 27.4, నిర్మల్‌లో 26.1, మెదక్‌లో 24.6, కామారెడ్డిలో 23.9, సంగారెడ్డిలో 23.8 శాతం అనామలీస్ నమోదయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో ఆదిలాబాద్ 30.4 శాతంతో ముందుండగా.. నారాయణఖేడ్ 29.3, నిజామాబాద్ అర్బన్ 28.4, షాద్‌నగర్ 28.3, నిర్మల్ 28.29, నిజామాబాద్ రూరల్ 28.1 శాతంతో కొనసాగుతున్నాయి. ఎస్ఐఆర్‌లో ఇప్పటివరకు సుమారు 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేసి బూత్ లెవల్ అధికారులు ధ్రువీకరించినట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో సుమారు 78.1 శాతానికి సమానం. ఆగస్టు 9 నాటికి దాదాపు 3.2 లక్షల ఫారాలు మాత్రమే డిజిటైజేషన్‌కు మిగిలి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువు ముగియడంతో ఇక అధికారుల దృష్టి తదుపరి ప్రక్రియపై పడింది. అందిన ఫారాలను పరిశీలించడం, వివరాలను ధ్రువీకరించడం, అనుమానాస్పదంగా ఉన్న వివరాలను పరిశీలించడం, అభ్యంతరాలు స్వీకరించడం వంటి ప్రక్రియలు కీలకంగా మారనున్నాయి.

### తుది జాబితాపైనే ఉత్కంఠ

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు బయటపడిన గణాంకాలు రాష్ట్ర ఓటర్ల జాబితాలో భారీ స్థాయిలో మార్పులకు అవకాశం ఉన్నట్లు సంకేతాలిస్తున్నాయి. ఒకవైపు గ్రేటర్ హైదరాబాద్‌లో భారీగా అన్‌కలెక్టబుల్ ఓటర్లు ఉండటం.. మరోవైపు ఉత్తర, పశ్చిమ తెలంగాణలో అధిక శాతం అనామలీస్ నమోదవడం ఎన్నికల వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. అయితే ప్రస్తుతం గుర్తించిన 70.8 లక్షల అన్‌కలెక్టబుల్ ఓటర్లందరి పేర్లూ తొలగిపోతాయని చెప్పడానికి వీల్లేదు. సంబంధిత ఫారాలు, ఆధారాలు, అభ్యంతరాలు, అధికారుల పరిశీలన అనంతరం మాత్రమే తుది నిర్ణయం ఉంటుంది. అందుకే ఎస్ఐఆర్ గడువు ముగిసిన ఈ దశలో అసలు ఉత్కంఠ మొదలైంది. 3.38 కోట్ల ప్రస్తుత ఓటర్ల జాబితాలో చివరకు ఎంతమంది మిగులుతారు? 70.8 లక్షలలో ఎంతమంది పేర్లు తొలగింపునకు గురవుతాయి? అన్నది తుది జాబితా వెలువడే వరకు ఆసక్తిని రేపనుంది.

# వర్షాల కోసం వరుణ యాగం

### నాగార్జునసాగర్‌లో శాస్త్రోక్తంగా మహా వరుణయాగం

### 11 హోమగుండాల్లో 108 మంది రుత్వికులతో క్రతువులు

### పంటలు పుష్కలంగా పండాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రార్థన



కాకతీయ, నాగార్జునసాగర్ : రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలని, శ్రీశైలం, నాగార్జునసాగర్ సహా అన్ని ప్రాజెక్టులు నిండాలని, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవాలని వరుణదేవుడిని ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నాగార్జునసాగర్‌లోని విజయ్‌విహార్ వద్ద కృష్ణానది ఒడ్డున ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో పూర్తయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు యాగంలో పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో వైదిక క్రతువులు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ యాగం నిర్వహించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు 11 హోమగుండాల్లో వరుణదేవుని అనుగ్రహం కోసం హోమక్రతువులు నిర్వహించారు. వర్షాలు, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం పరస్పరం అనుసంధానమై ఉన్నాయన్న భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలని, రైతుల ముఖాల్లో చిరునవ్వులు వెల్లివిరియాలన్న సంకల్పంతో క్రతువులు నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన వరుణయాగంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, పి. సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి కె. జానారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉదయ్ కృష్ణారెడ్డి కేసు సీబీసీఐడీకి బదిలీ చేయాలి

### సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు

కాకతీయ,తెలంగాణ బ్యూరో : ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసును సీబీసీఐడీ లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు ఈ–మెయిల్ పంపారు. పోష్ చట్టం కింద అంతర్గత విచారణ పూర్తికాకముందే ఉదయ్ కృష్ణారెడ్డిని ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. అరెస్టు సమయంలో ఆయన దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం, పరారయ్యే అవకాశాలను పరిశీలించారా అని నిలదీశారు. తొలుత బాధితురాలి ఫిర్యాదుల్లో అత్యాచారం, హత్యాయత్నం ఆరోపణలు లేవని, రిమాండ్ రిపోర్టులో తీవ్ర ఆరోపణలు చేర్చారని పేర్కొన్నారు. కేసుపై అనుమానాలకు స్వతంత్ర దర్యాప్తుతోనే తెరపడుతుందని తెలిపారు.

## కర్రెగుట్టల్లో చరిత్రాత్మక మార్పు!

(మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు, సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్, ఎస్ఐబీ తదితర భద్రతా విభాగాల అధికారులు కలిసి వెళ్లారని డీజీపీ తెలిపారు. ఇంతకాలం మావోయిస్టు భయంతో ప్రభుత్వ యంత్రాంగం చేరుకోలేని ప్రాంతంలో ఇప్పుడు అధికారులు అడుగుపెట్టడం కీలక పరిణామమన్నారు.

### మావోయిస్టు ప్రభావం తగ్గింది

తెలంగాణ ప్రాంతంలో గత 15 ఏళ్లుగా మావోయిస్టు సమస్య పెద్దగా లేకపోయినా.. ఏటూరునాగారం, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం ప్రభావం కొనసాగుతూ వచ్చిందని డీజీపీ వివరించారు. గత రెండేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చేపట్టిన చర్యలతో మావోయిస్టు సమస్యను గణనీయంగా నియంత్రించగలిగామని చెప్పారు. మావోయిస్టు సంస్థకు చెందిన సీనియర్ నాయకత్వంతో పాటు సెంట్రల్ కమిటీ సభ్యులు పలువురు లొంగిపోయారని, మరికొందరు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని తెలిపారు. వివిధ స్థాయిల్లోని క్యాడర్, దళ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో ఆయుధాలతో సహా ప్రభుత్వానికి లొంగిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పునరావాస కార్యక్రమాలు అమలు చేస్తున్నామని డీజీపీ తెలిపారు. రివార్డు ఉన్న వారికి ఆ మొత్తాన్ని అందించడంతో పాటు.. రివార్డు లేని వారికి కూడా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. వ్యవసాయం చేసుకునేందుకు, ఇళ్లు నిర్మించుకునేందుకు భూమి కల్పించే చర్యలు కూడా చేపడుతున్నట్లు వివరించారు.

### సరిహద్దులో భద్రతపై సమీక్ష

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూజెర్ కాంకేర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తడపల సరిహద్దు ప్రాంతంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ 196వ బెటాలియన్ క్యాంపును డీజీపీ సందర్శించారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసు అధికారులు, భద్రతా బలగాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. సరిహద్దు ప్రాంతంలో భద్రతను మరింత పటిష్టం చేయడం, ఇరు రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయం పెంచడం, రాకపోకలకు అనువుగా రహదారి సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతంలో సుమారు కిలోమీటరు మేర రహదారి నిర్మాణానికి సంబంధించిన అంశంపైనా సమీక్ష జరిగినట్లు సమాచారం. కర్రెగుట్ట చుట్టుపక్కల గ్రామాలు దాదాపు నాలుగు నుంచి ఐదు దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్నాయని డీజీపీ తెలిపారు. అక్కడ పాఠశాలలు, విద్యా సదుపాయాలు, ఆస్పత్రులు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేవని పేర్కొన్నారు. ఇకపై ఆ ప్రాంతానికి విద్య, వైద్యం, రహదారులు, ఇతర మౌలిక వసతులను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. ''సరిహద్దులో జాతీయ జెండా ఎగురవేయడం కేవలం ఒక కార్యక్రమం కాదు. ఇకపై కర్రెగుట్టలో అభివృద్ధి కార్యక్రమాలకు నాంది'' అని డీజీపీ పేర్కొన్నారు.

## పెద్ది అంటే వ్యక్తి కాదు..శక్తి!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తుచేస్తూ.. ''పెద్ది జన్మ ధన్యమైంది.. అలాంటి జనాభిమానాన్ని నేను ఎప్పుడూ చూడలేదు'' అన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభ సోమవారం నల్లబెల్లిలో భావోద్వేగ వాతావరణంలో జరిగింది. మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు.. ఉద్యమ సహచరుడిగా, ప్రజా నాయకుడిగా పెద్ది సుదర్శన్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే పెద్ది పేరును మెమోరియల్ ఆస్పత్రికి పెడతామని కేటీఆర్ ప్రకటించారు. పెద్ది విగ్రహం కోసం ఏర్పాటు చేసిన గద్దెను కూల్చినంత మాత్రాన ప్రజల గుండెల్లో ఆయన జ్ఞాపకాలను చెరపలేరని వ్యాఖ్యానించారు.

### నెలల తరబడి ఒకే ఇంట్లో..

తెలంగాణ ఉద్యమ సమయంలో పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి ఒకే ఇంట్లో ఉంటూ నెలల తరబడి ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నామని హరీశ్‌రావు గుర్తుచేశారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనల్లో కలిసి పాల్గొన్నామని.. అమరవీరుల కోసం పోరాడుతూ లాఠీ దెబ్బలు తిన్నామని చెప్పారు. పెద్ది ఒక నియోజకవర్గానికి పరిమితమైన నాయకుడు కాదని.. తెలంగాణ ఉద్యమానికి వరంగల్ జిల్లాను అండగా నిలిపిన ఉద్యమ కెరటం అని కొనియాడారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించే సమయంలో తాను ప్రమాదవశాత్తు జారిపడుతుండగా పెద్ది పట్టుకుని కాపాడిన ఘటనను హరీశ్‌రావు గుర్తుచేసుకున్నారు. తనకు యశోద ఆస్పత్రిలో చికిత్స చేయించారని తెలిపారు.

### రైతుల కోసం రూ.100 కోట్ల అండ

ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి రైతుల కోసం చేసిన సేవలను హరీశ్‌రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. తుఫాన్‌తో పంటలు దెబ్బతిన్న సమయంలో నియోజకవర్గ రైతులకు అండగా నిలిచారని తెలిపారు. సుమారు రూ.100 కోట్ల విలువైన వ్యవసాయ పరికరాలు, పంపులు, మోటార్లను రాయితీపై అందించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతులకు సహాయం అందించిన నాయకుడిగా పెద్ది గుర్తుండిపోతారని అన్నారు. ప్రజల సమస్యలపై స్పందించే తత్వం, రైతుల పట్ల చిత్తశుద్ధి కారణంగానే పెద్ది సుదర్శన్‌రెడ్డి కేసీఆర్‌కు అత్యంత ఇష్టమైన నాయకుల్లో ఒకరిగా నిలిచారని హరీశ్‌రావు చెప్పారు.

### ''అలాంటి జనాభిమానాన్ని చూడలేదు''

కేటీఆర్ మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్‌రెడ్డి జన్మ ధన్యమైందన్నారు. ముఖ్యమంత్రులు, ప్రముఖ నాయకులు మరణించినప్పుడు భారీగా ప్రజలు తరలిరావడం చూశామని.. అయితే పెద్ది అంతిమయాత్రలో కనిపించిన జనసందోహం, ప్రజాభిమానాన్ని తాను ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. పెద్దికి చివరి వీడ్కోలు పలికేందుకు ప్రజలు గంటల తరబడి వేచి ఉన్నారని, సుమారు 12 గంటలపాటు ఓపికగా నిలిచి నివాళులర్పించారని గుర్తుచేశారు.

### పెద్ది పేరుతో మెమోరియల్ ఆస్పత్రి

మరో రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరును మెమోరియల్ ఆస్పత్రికి అధికారికంగా పెట్టేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ''గోదావరి నీళ్లు ప్రవహించినంతకాలం.. ఆస్పత్రిలో పుట్టే ప్రతి బిడ్డలో పెద్ది సుదర్శన్‌రెడ్డి జ్ఞాపకం ఉండేలా ఆయన పేరు నిలిచిపోతుంది'' అని కేటీఆర్ అన్నారు. ప్రజల కోసం పెద్ది చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కోసం ఏర్పాటు చేసిన గద్దెను కూల్చినంత మాత్రాన ఆయనను ప్రజల మనసుల్లోంచి తొలగించలేరని కేటీఆర్ అన్నారు. విగ్రహాలు, గద్దెలు తొలగించవచ్చేమో కానీ.. ప్రజల గుండెల్లో ఉన్న పెద్ది జ్ఞాపకాలను ఎవరూ చెరపలేరని వ్యాఖ్యానించారు. అందుకే ఆయన మరణించిన సమయంలో ప్రజలు, అభిమానులు స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆయనకు లభించిన అపూర్వమైన ప్రజాభిమానమే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజా జీవితానికి అసలైన గుర్తింపు అని అన్నారు.

# లోన్ల పేరుతో సైబర్ దోపిడీ!

**ఢిల్లీ కేంద్రంగా తెలంగాణపై భారీ మోసాల నెట్‌వర్క్**

**మూడు నకిలీ కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ పోలీసుల దాడి**

**21 మంది తెలుగు టెలీకాలర్లు, బ్యాంకు ఖాతాదారుడి అరెస్టు**

కాకతీయ, హైదరాబాద్ : తెలంగాణ ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఢిల్లీ కేంద్రంగా సాగుతున్న భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ఛేదించారు. బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులమంటూ రుణాలు ఇప్పిస్తామని నమ్మించి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు. ఢిల్లీలోని శివ మార్కెట్ ప్రాంతంలో నిర్వహిస్తున్న 3 నకిలీ కాల్ సెంటర్లపై ఏకకాలంలో దాడులు చేసి 21 మంది తెలుగు మాట్లాడే మహిళా టెలీకాలర్లతో పాటు ఓ బ్యాంకు ఖాతాదారుడిని అదుపులోకి తీసుకున్నారు. 23 మొబైల్ ఫోన్లు, 2 బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ అనే ముగ్గురు ఢిల్లీలోని శివ మార్కెట్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో 3 నకిలీ కాల్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న తెలుగులో అనర్గళంగా మాట్లాడే మహిళలను టెలీకాలర్లుగా నియమించుకున్నట్లు వెల్లడించారు. అరెస్టయిన వారిలో హైదరాబాద్, జగిత్యాల, మహబూబ్‌నగర్ తదితర తెలంగాణ ప్రాంతాలకు చెందినవారు ఉన్నట్లు తెలిపారు.

### ప్రాసెసింగ్ ఫీజు పేరుతో వసూళ్లు

ముందుగా సిద్ధం చేసుకున్న స్క్రిప్ట్ ప్రకారం బాధితులకు ఫోన్లు చేసి బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులమని పరిచయం చేసుకునేవారు. ఆకర్షణీయమైన రుణ ఆఫర్లు చూపించి లోన్ మంజూరు చేస్తామని నమ్మించేవారు. అనంతరం ప్రాసెసింగ్ ఫీజు, వెరిఫికేషన్ ఛార్జీలు, డాక్యుమెంటేషన్ ఫీజు, బీమా ప్రీమియం తదితర కారణాలు చెబుతూ విడతల వారీగా డబ్బులు వసూలు చేసేవారు. బాధితుల నుంచి బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగిన వారిని బెదిరించిన సందర్భాలు కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. తెలంగాణలో నమోదైన 22 సైబర్ మోసాల కేసులతో ఈ నెట్‌వర్క్‌కు సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో ఢిల్లీకి చేరుకున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు 3 కాల్ సెంటర్లపై ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. ప్రధాన నిర్వాహకులుగా ఉన్న లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు.

### 'తెలుగులో మాట్లాడితే నమ్మొద్దు'

రుణాలు ఇప్పిస్తామంటూ వచ్చే ఫోన్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు. కాల్ చేసిన సంస్థ నిజమైనదేనా, రుణ ఆఫర్ వాస్తవమా అన్నది నిర్ధారించుకున్న తర్వాతే ఎలాంటి చెల్లింపులైనా చేయాలని తెలిపారు. మహిళలు తెలుగులో మాట్లాడుతున్నారన్న కారణంతో వారిని నమ్మి బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారం, ఓటీపీ వంటి సున్నితమైన సమాచారాన్ని వెల్లడించవద్దని హెచ్చరించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# కొలంబియాలో భారీ భూకంపం

**7.4 తీవ్రతతో ప్రకంపనలు.. 47 మంది మృతి**

**భవనాల శిథిలాల కింద పలువురు.. పెరీరా, కాలీ, క్విబ్డోలో భారీ నష్టం**



బొగోటా : దక్షిణ అమెరికా దేశమైన కొలంబియాలో సోమవారం భారీ భూకంపం సంభవించింది. పశ్చిమ కొలంబియాలోని శాన్ జోస్ డెల్ పాల్మర్ సమీపంలో సంభవించిన ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో నమోదైంది. భూకంపం ధాటికి ఇప్పటివరకు 47 మంది మృతి చెందినట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో ఇళ్లు, భవనాలు కూలిపోవడంతో శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అమెరికా భూగర్భ సర్వే (యూఎస్‌జీఎస్) ప్రకారం భూకంప కేంద్రం భూమికి 107 కిలోమీటర్ల లోతులో ఉంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7.34 గంటలకు ప్రకంపనలు సంభవించాయి. భూకంప ప్రభావం పొరుగున ఉన్న ఈక్వెడార్‌లోనూ కనిపించింది. ప్రకంపనలతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

### పెరీరాలో భారీ నష్టం

భూకంప ప్రభావంతో పెరీరా నగరంతో పాటు పశ్చిమ కొలంబియాలోని పలు ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. ఇళ్లు, భవనాలు దెబ్బతిన్నాయి. మానిజాలెస్‌లోని నియో–గోతిక్ కేథడ్రల్ చర్చి టవర్ కూలి ప్రధాన ప్రార్థనా మందిరంపై పడింది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం. కాలీలోనూ పలు భవనాలు కూలిపోవడంతో ప్రజలు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. క్విబ్డో ప్రాంతంలోనూ భవనాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. భూకంపం అనంతరం మరిన్ని ప్రకంపనలు సంభవించే అవకాశం ఉందన్న హెచ్చరికలతో ప్రజలు ఇళ్లలోకి వెళ్లకుండా బయటే ఉండాలని అధికారులు సూచించారు. కూలిన భవనాల శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించి వెలికితీసేందుకు అత్యవసర బృందాలు రంగంలోకి దిగాయి. కొలంబియా ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

# కాకర్ల సమత లొంగుబాటు



- నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో
- ఎట్టకేలకు జనజీవన స్రవంతిలోకి సీనియర్ నాయకురాలు
- పునరావాసానికి ప్రభుత్వం భరోసా..
- ఆరోగ్య కార్డులు, ఉపాధి శిక్షణ, రుణాల సాయం
- డీఐజీ సీవీ ఆనంద్ వెల్లడి

కాకతీయ, ములుగు ప్రతినిధి : దాదాపు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో అండర్‌గ్రౌండ్‌లో కొనసాగిన సీనియర్ నాయకురాలు కాకర్ల సమత అలియాస్ మాధవి, షకీలా, దుర్గా జనజీవన స్రవంతిలోకి వచ్చారు. తెలంగాణ పోలీసుల ఎదుట ఆమె లొంగిపోయారు. హింసా మార్గాన్ని వీడి సాధారణ జీవితంలోకి వచ్చిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని డీఐజీ సీవీ ఆనంద్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఆరోగ్య రక్షణ కార్డులు, ఉపాధి శిక్షణ, స్వయం ఉపాధికి రుణాలు, అవసరమైన ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని పోలీసు కాన్ఫరెన్స్ కార్యాలయంలో సమత లొంగుబాటు వివరాలను ఆయన వెల్లడించారు. 1985లో వైజాగ్ ప్రాంతంలో నక్సలైట్ కార్యకలాపాలతో ప్రభావితమైన సమత అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లారని డీఐజీ తెలిపారు. అప్పటి నుంచి సుమారు 40 ఏళ్లపాటు వివిధ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీకి పనిచేశారని చెప్పారు. హైదరాబాద్ కమిటీ, నల్లమల, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక–మహారాష్ట్ర ఉమ్మడి కమిటీల్లో కీలక బాధ్యతలు నిర్వహించినట్లు వివరించారు. పార్టీ డాక్యుమెంటేషన్, సిద్ధాంతపరమైన పత్రాల రూపకల్పన, అనువాదాలు, మహిళా సమస్యలపై రచనలు, క్యాడర్‌కు శిక్షణ వంటి బాధ్యతలు కూడా నిర్వహించారని తెలిపారు. మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతికి సీసీ స్టాఫ్ మెంబర్‌గా పనిచేసినట్లు పేర్కొన్నారు.

### 23 మందికి రూ.2 కోట్ల సాయం

సమత కుటుంబంలోనూ మావోయిస్టు నేపథ్యం ఉందని డీఐజీ తెలిపారు. ఆమె సోదరి కాకర్ల సునీత అలియాస్ బద్రి గత ఏడాది తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారని చెప్పారు. సమత భర్త పటేల్ సుధాకర్‌రెడ్డి మావోయిస్టు పార్టీలో మిలిటరీ కమిషన్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేసి 2010లో ఎదురుకాల్పుల్లో మృతి చెందినట్లు వెల్లడించారు. ఇప్పటికే 23 మంది లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కింద దాదాపు రూ.2 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఉపాధి కోసం శిక్షణ, రుణాలు, వైద్య సహాయం అందిస్తూ వారిని సమాజంలో గౌరవప్రదంగా స్థిరపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మావోయిస్టు పార్టీ ప్రస్తుత జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితో పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న నాయకులు హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని డీఐజీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. వారి సమస్యలు, కేసులకు సంబంధించిన ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైతే కేంద్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలతోనూ చర్చిస్తామని తెలిపారు. మావోయిస్టు కార్యకలాపాలకు గతంలో కీలకంగా ఉన్న ప్రాంతం కావడంతోనే ములుగులో కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

# కాకతీయ వైభవానికి సరికొత్త కళ



- మ్యూజికల్ గార్డెన్‌తో వరంగల్‌కు నూతన శోభ
- రూ.6.20 కోట్లతో పునరుద్ధరణ
- గార్డెన్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : నగరానికి మరో సరికొత్త పర్యాటక ఆకర్షణ తోడైంది. రూ.6.20 కోట్ల వ్యయంతో పునరుద్ధరించిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి మ్యూజికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మ్యూజికల్ ఫౌంటెన్, ప్రత్యేక లేజర్ షోను వీక్షించారు. కాకతీయుల చరిత్ర, పరిపాలనా వైభవం, కళలు, సంస్కృతి, శిల్పకళను వెలుగు, సంగీతం, దృశ్యాల సమ్మేళనంతో ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చరిత్ర పుస్తకాల్లో చదివే కాకతీయుల ఘనతను సజీవ దృశ్యాల రూపంలో సందర్శకులకు పరిచయం చేసేలా లేజర్ షోను రూపొందించడం అభినందనీయం. ఇది పిల్లలతో పాటు భావితరాలకు కాకతీయుల గొప్పదనాన్ని తెలియజేస్తుందని అన్నారు.

### వరంగల్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

కాకతీయుల ఘన చరిత్రకు ప్రతీకగా నిలిచిన వరంగల్ నగరంలో పర్యాటక, సాంస్కృతిక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి తెలిపారు. నగర ప్రజలకు సేదతీరే ఆహ్లాదకర ప్రదేశంగా, సందర్శకులకు చారిత్రక అనుభూతిని కలిగించే పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంది. పునరుద్ధరణలో భాగంగా గార్డెన్ సుందరీకరణ, పచ్చదనం, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామని వివరించారు. కాకతీయుల కళా వైభవం, నిర్మాణ నైపుణ్యం, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు చేరవేసేలా ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. వరంగల్ చారిత్రక, సాంస్కృతిక ప్రత్యేకతలను ప్రపంచానికి చాటడంతో పాటు పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా నగరంలోని పర్యాటక మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామన్నారు. చరిత్రను కాపాడుతూ ఆధునిక సదుపాయాలను జోడించడం ద్వారా వరంగల్‌ను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కుడా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉద్రిక్తతల మధ్య పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహ ప్రతిష్ఠ

**నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో నివాళులు**



కాకతీయ, నర్సంపేట టౌన్ : దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నర్సంపేటలో ఉద్రిక్తతల నడుమ జరిగింది. ప్రజాసేవ చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి స్మారకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్మించిన గద్దెను కూల్చివేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ బీఆర్ఎస్ శ్రేణులు తిరిగి గద్దెను నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు తెలిపారు. అనంతరం వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కొబ్బరికాయ కొట్టి, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం సేవలందించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి స్మారకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమన్నారు. విగ్రహ ప్రతిష్ఠను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరగడం విచారకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్ది లేని లోటు పూడ్చలేనిది

**విగ్రహ గద్దె కూల్చివేత దుర్మార్గం**

**తెలంగాణ ఉద్యమంలో పెద్ది సేవలు చిరస్మరణీయం**

**ప్రభుత్వమే పెద్ది విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి**



కాకతీయ, కాజీపేట : తెలంగాణ ఉద్యమంలో తనతో కలిసి పోరాడిన నర్సంపేట మాజీ శాసనసభ్యుడు, ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి లేని లోటు పూడ్చలేనిదని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాజీపేట చౌరస్తాలో సోమవారం నిర్వహించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి యాది కార్యక్రమంలో ఆయన పాల్గొని, పెద్ది చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ పెద్ది సుదర్శన్‌రెడ్డి నిస్వార్థమైన గొప్ప తెలంగాణ ఉద్యమకారుడని, గొప్ప నాయకుడని కొనియాడారు. తనకు పెద్ది సుదర్శన్‌రెడ్డితో ఉద్యమ అనుబంధం ఉందని తెలిపారు. తెలంగాణ కోసం ఇద్దరం కలిసి పోరాడామని, కాజీపేట కేంద్రంగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, బంద్‌లు, వంటావార్పులు నిర్వహించామని గుర్తుచేశారు. రాస్తారోకోలు, రైల్‌రోకోలు చేసి అనేక కేసులు ఎదుర్కొని కోర్టులకు వెళ్లామని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో ఇద్దరం కలిసి పోరాడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం పెద్ది సుదర్శన్‌రెడ్డి నిరంతరం కృషి చేశారని అన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుకు నిర్మించిన గద్దెను కూల్చివేయడం దుర్మార్గమని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకుడిగా, నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన మాజీ ప్రజాప్రతినిధిగా ఆయన విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# మోదీ విధానాలకు వ్యతిరేకంగా భారీ రాస్తారోకో

**గుండాలలో జైల్‌భరో విజయవంతం**

**లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని డిమాండ్**




కాకతీయ, గుండాల: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం గుండాల మండల కేంద్రంలో సీఐటీయూ, రైతు, రైతు కూలీ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈసం వెంకటమ్మ, ఊకే వెంకటేశ్వర్లు, తోలెం గోపి, తోలెం భూపాల్, గడ్డం లాలయ్య, సాహెబ్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, వీబీ–జీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. రైతులకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని, నూతన విత్తన, విద్యుత్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వజ్జ సుశీల, జోగ రాజేష్, దుగ్గి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరుకు జాతీయ హోదా లేనట్టే!

- రాజ్యసభలో కేంద్రం స్పష్టత.. ప్రతిపాదన లేదని వెల్లడి
- సీడబ్ల్యూసీకి పంపిన డీపీఆర్ వెనక్కి..
- కృష్ణా జలాల వివాదం కారణంగా సాంకేతిక మదింపు నిలిపివేత
- నాలుగు ప్యాకేజీల అంచనాలు పెంపు..
- ఖజానాపై రూ.2,353.38 కోట్ల అదనపు భారం



కాకతీయ, తెలంగాణ బ్యూరో : పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్–2 పరిధిలో ఉండటంతో ఈ వ్యవహారం న్యాయస్థాన పరిధిలో ఉందని పేర్కొంది. దీంతో ప్రాజెక్టు డీపీఆర్‌పై సాంకేతిక, ఆర్థిక మదింపు చేయలేమని తెలిపింది. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్రం ఈ మేరకు సమాధానం ఇచ్చింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలంటే ముందుగా సాంకేతిక, ఆర్థిక మదింపు పూర్తికావాల్సి ఉండగా, ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాదని కేంద్రం వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ వెనక్కి పంపినట్లు తెలిపింది.

### జాతీయ హోదాపై మళ్లీ బ్రేక్

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించాలని తెలంగాణ నుంచి చాలాకాలంగా డిమాండ్ ఉంది. అయితే కృష్ణా జలాల వినియోగానికి సంబంధించిన అంతర్రాష్ట్ర వివాదం ట్రిబ్యునల్ పరిధిలో ఉండటంతో ప్రాజెక్టు సాంకేతిక పరిశీలన ముందుకు సాగడం లేదని కేంద్రం స్పష్టం చేసింది. గతంలోనూ కేంద్రం జాతీయ ప్రాజెక్టుల పథకంలో చేర్చేందుకు సీడ బ్ల్యూసీ పరిశీలన, సంబంధిత కమిటీల ఆమోదం అవసరమని తెలిపింది. మరోవైపు ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోంది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని 7, 11, 15, 17 ప్యాకేజీల సవరించిన అంచనాలకు జులై 17న జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్ర ఖజానాపై అదనంగా రూ.2,353.38 కోట్ల భారం పడనుంది. ఈ నాలుగు ప్యాకేజీల పనులకు 2016లో ఒప్పందాలు జరిగినప్పటికీ భూసేకరణలో జాప్యం, జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసులు తదితర కారణాలతో పనులు ముందుకు సాగలేదు.

### జీఓ–94లో మార్పులకు కమిటీ

కాంట్రాక్టు ఒప్పందాలు, టెండర్ ప్రక్రియ, పనుల్లో జాప్యం, పెరిగిన వ్యయం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మూడు దశాబ్దాల క్రితం జారీ చేసిన జీఓ–94లో మార్పులు చేసేందుకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపినప్పటికీ, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో నిబంధనలను మరింత కఠినతరం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాలుగు ప్యాకేజీలకు 2016లో ఒప్పందాలు జరిగినా దశాబ్దం గడిచినప్పటికీ పనులు పూర్తికాకపోవడం ప్రాజెక్టు పురోగతిపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఒప్పంద కాలంలోనే పనులు పూర్తికాకపోవడంతో ధరల పెరుగుదల, అదనపు పనులు, వస్తు సేవల పన్ను తదితర కారణాలతో అంచనాలు భారీగా పెరిగాయి. ఒకవైపు జాతీయ హోదాపై కేంద్రం నుంచి ప్రతికూల ప్రకటన రావడం, మరోవైపు సవరించిన అంచనాలతో రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడటం పాలమూరు ప్రాజెక్టుపై కొత్త చర్చకు దారితీసింది.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

**అర్హులకు దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు**
**ఇప్పటి వరకు 8 లక్షల ఇళ్లు మంజూరు చేశాం**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**
**అనర్హుల తేలితే కేటాయింపులు రద్దు :**
**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**




కాకతీయ, వరంగల్ బ్యూరో : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలను పేదల గుమ్మం వద్దకే చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సొంతిల్లు ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి దశలో 4.5 లక్షలు, రెండో దశలో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, హైదరాబాద్‌తో కలిపి ఇప్పటివరకు 8 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న మూడో, నాలుగో దశల్లోనూ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 వేల అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా ఇళ్లను కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు.

### రూ.5 లక్షల ఆర్థిక సాయం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని దశలవారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందని మంత్రి తెలిపారు. ఇంటి నిర్మాణ దశను పరిశీలించి తదుపరి విడత నిధులు విడుదల చేస్తామని చెప్పారు. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా నిధులు నేరుగా లబ్ధిదారులకు చేరేలా చర్యలు చేపట్టామని వివరించారు. కాలనీల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ఎజెండా అన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ కమలాపూర్ మండలంలో 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను అర్హులైన పేద కుటుంబాలకు అందించడం సంతోషకరమన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి 394 కుటుంబాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. తప్పుడు సమాచారం ద్వారా అనర్హులు ఎంపికైనట్లు తేలితే కేటాయింపులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారం రోజుల్లో ఇళ్లను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# యూరియా ధర పెంచారా?

**రూ.266 బస్తా.. రూ.300కు విక్రయం**
**రవాణా ఖర్చుల పేరుతో రూ.34 అదనపు వసూలు**
**అధికారుల అనుమతి ఉందా.. అయోమయంలో రైతన్నలు**




కాకతీయ,నర్సంపేట టౌన్ : యూరియా బస్తా ధర విషయంలో రైతుల్లో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.266 కాగా, నర్సంపేట నియోజకవర్గంలోని పలు మండలాల్లోని సహకార సొసైటీల్లో అదే యూరియా బస్తాను రూ.300కు విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. రవాణా ఖర్చుల పేరుతో బస్తాకు అదనంగా రూ.34 వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో యూరియా ధర పెంచారా.. లేక రవాణా ఖర్చుల పేరుతో అదనపు మొత్తం వసూలు చేస్తున్నారా అన్నది స్పష్టత లేక రైతులు అయోమయానికి గురవుతున్నారు. పీఏసీఎస్‌లకు ఎరువుల ఉచిత రవాణా సదుపాయాన్ని ప్రభుత్వం ఇటీవల నిలిపివేసినట్లు సమాచారం. జూలై 8న వ్యవసాయశాఖ నుంచి దీనికి సంబంధించిన ఆదేశాలు వెలువడినట్లు తెలుస్తోంది. దీంతో సొసైటీలపై రవాణా భారం పడే అవకాశం ఉంది. అయితే ఆ భారాన్ని రైతులపై మోపి బస్తాకు అదనంగా రూ.34 వసూలు చేసే అధికారం సొసైటీలకు ఉందా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### రూ.34కు లెక్క చెప్పాలి

రూ.266 ఎంఆర్‌పీ ఉన్న యూరియా బస్తాను రూ.300కు విక్రయిస్తే అదనంగా తీసుకుంటున్న రూ.34కు లెక్క చెప్పాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. రవాణా ఖర్చు పేరుతో ఎంత వసూలు చేయాలి, అందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి ఉంది, అదనపు మొత్తానికి రైతులకు రశీదు ఇస్తున్నారా అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ఉచిత రవాణా సదుపాయం రద్దయినంత మాత్రాన యూరియా ధర పెరిగిందా? లేక రవాణా ఖర్చును రైతుల నుంచి ప్రత్యేకంగా వసూలు చేసుకోవచ్చా? అనే విషయాన్ని వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు స్పష్టం చేయాలని రైతులు కోరుతున్నారు. రూ.300కు విక్రయించేందుకు అధికారిక అనుమతి ఉంటే సంబంధిత ఉత్తర్వులను బహిర్గతం చేయాలని, అనుమతి లేకుంటే అదనపు వసూళ్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# జీడబ్ల్యూఎంసీ ఎన్నికలే లక్ష్యం

**ఎన్నికలకు కాంగ్రెస్ పకడ్బందీ వ్యూహం**
**డివిజన్ల వారీగా బలాబలాలపై**
**మంత్రి పొంగులేటి సమీక్ష**
**క్షేత్రస్థాయి బలోపేతంపై ప్రత్యేక దృష్టి**
**ఓటర్ల జాబితాపై పక్కా నిఘా..**
**డీసీసీ భవన్‌కు భూమిపై సానుకూల స్పందన**
**పొంగులేటి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష**



కాకతీయ, హన్మకొండ : రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. డివిజన్ల వారీగా పార్టీ బలాబలాలను అంచనా వేసి, స్థానిక సమస్యలను గుర్తించి గెలుపు వ్యూహాలను అమలు చేయాలని సూచించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జిల్లా ముఖ్య నాయకులతో ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. డీసీసీ భవన్‌కు వచ్చిన మంత్రికి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు.

### ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుత ఓటర్ల జాబితాలోని తప్పుడు చిరునామాలు, బోగస్ ఓట్లు, నాన్ మ్యాపింగ్ ఓటర్లను గుర్తించి అవసరమైన సవరణలు, తొలగింపులు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జాబితాను సమగ్రంగా పరిశీలించాలని నిర్ణయించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజల మద్దతు కూడగట్టాలని నూతన మండల, డివిజన్ అధ్యక్షులకు సూచించారు. హనుమకొండ జిల్లా నూతన డీసీసీ కార్యాలయ నిర్మాణానికి భూమి కేటాయింపు ప్రతిపాదనను రాబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ప్రవేశపెట్టి త్వరగా ఆమోదం లభించేలా చొరవ తీసుకోవాలని జిల్లా నాయకులు పొంగులేటిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. పీఏసీఎస్‌లు, స్టేట్ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ల పదవుల భర్తీని పారదర్శకంగా చేపట్టాలని, ప్రతిపాదనలను డీసీసీ ద్వారా రాష్ట్ర కమిటీకి పంపేలా సమన్వయం చేయాలని నిర్ణయించారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన 13 మండల అధ్యక్షులు, 10 డివిజన్ అధ్యక్షులతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, మాజీ మేయర్ గుండు సుధారాణి, వివిధ చైర్మన్లు రియాజ్, అజీజ్‌ఖాన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఈవీ శ్రీనివాస్‌రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అనుబంధ సంఘాల చైర్మన్లు, నూతనంగా నియమితులైన 13 మండల అధ్యక్షులు, వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 10 డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి భరోసాగా ప్రభుత్వం

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**
**రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు**
**ధాన్యం కొనుగోళ్లకు పూర్తి మద్దతు**
**వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక**
**రైతు మేళా సూచనలు తోటి రైతులతో పంచుకోవాలి**
**శాస్త్రీయ పరిజ్ఞానంతో సాగులో మెరుగైన ఫలితాలు**
**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా**
**ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



కాకతీయ, హన్మకొండ : రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.

### భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులు, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. భూభారతి విధానం ద్వారా భూములకు స్పష్టమైన హక్కులు, టైటిల్, భూ రికార్డులు, మ్యాప్ వివరాలు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సమగ్ర భూ సర్వేకు రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు అందించి సహకరించాలని కోరారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం పూర్తి మద్దతు అందించిందని చెప్పారు. గతంలో గోదాములు, నిల్వ మౌలిక వసతులు లేక ఇబ్బందులు తలెత్తాయని, ప్రస్తుత ప్రభుత్వం గోదాముల సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేసిందన్నారు.

### వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు

వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే పంటలను ఎంచుకోవాలని, నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. శాస్త్రవేత్తల సూచనలను రైతుల అనుభవంతో సమన్వయం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. రైతు మేళాలో నేర్చుకున్న ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తోటి రైతులతో పంచుకోవాలని అన్నారు. రైతుల అనుభవానికి శాస్త్రీయ పరిజ్ఞానం తోడైతే వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ రైతు మేళా ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికతలు, శాస్త్రీయ విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి, ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, జిల్లా ఉద్యానవన అధికారి కమలాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

## ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కరుణాకర్



కాకతీయ, నెల్లికుదురు : ఎస్సై చిర్ర రమేష్ బాబు బదిలీపై గూడూరు వెళ్ళగా ఇనుగుర్తి మండలంలో విధులు నిర్వహించిన ఎస్సై గంగారపు కరుణాకర్ నూతనంగా నెల్లికుదురు ఎస్సైగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రత లకు ఎలాంటి ఆటంకం చేయకుండా యువకులు, మండల ప్రజలు సహకరించాలని, డ్రగ్స్ మత్తుకు బానిస కాకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించి వాహనదారులు ఎలిమెంట్ ధరించాలన్నారు. చట్ట వ్యతిరేక పనులు చేసిన ఎంతటి వారనైనా ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు.

## మృతుని కుటుంబానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ



కాకతీయ, పెద్దవంగర : మండల కేంద్రంలోని అవుతాపురం గ్రామానికి చెందిన చిలుకమారి సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోమవారం మృతుడి నివాసానికి చేరుకొని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి దహన సంస్కారంలో పాల్గొన్నారు. సత్తయ్య మరణానికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకుని మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల, గ్రామ,యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

**రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న**



కాకతీయ, నెల్లికుదురు: కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. అనంతరం రాజన్న మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లను, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు వీబీ–జీ రామ్‌జీ పథకాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. విద్యుత్ రంగంలో ఉచితాలను తొలగించే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, సాగు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసంపల్లి సైదులు, పెరుమాండ్ల బాబు గౌడ్, వీరలక్ష్మి , వెంకటమ్మ, విజయ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి

**బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి**



కాకతీయ, నర్సంపేట టౌన్: బీజేపీ జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి తన నివాసంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ జెండా ప్రతి భారతీయుడి దేశభక్తికి ప్రతీక అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో దేశంలో జాతీయవాద భావన మరింత బలపడుతోందని పేర్కొన్నారు. ఆగస్టు 10 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాను సగర్వంగా ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉర్సు–ఖమ్మం హైవేపై ఘోర ప్రమాదం

- కారు ఢీకొని వృద్ధుడు అక్కడికక్కడే మృతి
- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు
- ప్రమాదంపై దర్యాప్తు చేపట్టిన మిల్స్‌కాలనీ పోలీసులు



కాకతీయ, వరంగల్ బ్యూరో : ఉర్సు–ఖమ్మం హైవేపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థాని కులు తెలిపారు. నాయుడు బంక్ ప్రాంతానికి చెందిన బంక కొమురయ్య ద్వి చక్ర వాహ నంపై వెళ్తుండగా ఉర్సు–ఖమ్మం హైవేపై కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన కొమురయ్య ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందిం చారు. అనంతరం మృతదేహాన్ని వైద్య పరీక్షల నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణాలు, కారు వేగం తదితర అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# కోరేకల్ ఇసుకలో అదనపు దందా!

**రసీదులో ఉన్నదానికంటే రూ.3,500 వరకు అదనం?**
**చార్జీలన్నీ అధికారికంగానే.. మరి ఈ వసూళ్లెందుకు?**
**35 టన్నులకు రూ.13,783 చెల్లించిన లారీ ఓనరు**
**రసీదు బయట వసూళ్లపై కాకతీయ చేతికి చిక్కిన వీడియోలు**
**విచారిస్తున్నామని కాకతీయకు పీవో వివరణ**

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ఇసుక కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడి నుంచి ప్రభుత్వం నిర్ణయించిన రుసుములన్నీ పక్కాగా వసూలు చేస్తోంది. ఇసుక ధరతోపాటు సేవా రుసుము, రోడ్డు డ్యామేజ్ చార్జీ, వెయిమెంట్ ఫీజు, జీఎస్టీ.. ఇలా ఒక్కో అంశానికి ప్రత్యేకంగా లెక్క కట్టి అధికారిక రసీదు జారీ చేస్తోంది. అయినా.. రసీదులో పేర్కొన్న మొత్తానికి అదనంగా ఒక్కో లారీకి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రావడం విస్మయానికి గురిచేస్తోంది. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కోరేకల్ ఇసుక స్టాక్‌యార్డులో ఈ అదనపు వసూళ్లకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి రావడంతో వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వమే ప్రతి రుసుముకూ లెక్క చెబుతున్నప్పుడు.. రసీదు బయట వసూలవుతున్న అదనపు మొత్తం ఎవరి లెక్క? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోరేకల్ స్టాక్‌యార్డు నుంచి 35 మెట్రిక్ టన్నుల ఇసుకకు జారీ చేసిన అధికారిక రసీదు ఈ వ్యవహారంలో కీలకంగా మారింది. సాండ్ సేల్స్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా జారీ చేసిన ఈ రసీదులో ఇసుక ధర రూ. 13,125గా ఉంది. టీజీఎండీసీ సేవా రుసుము కింద రూ. 1,225, రోడ్డు డ్యామేజ్ చార్జీ రూ.250, వెయిమెంట్ ఫీజు రూ.100గా పేర్కొన్నారు. వీటికి వర్తించే జీఎస్టీని కలిపి మొత్తం రూ.13,783 చెల్లించినట్లు రసీదు లో స్పష్టంగా నమోదైంది.


ప్రతి రుసుముకూ ప్రత్యేక లెక్క

35 మెట్రిక్ టన్నుల ఇసుకకు టన్నుకు రూ.375 చొప్పున రూ.13,125 ధర నిర్ణయించారు. దీనిపై సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ వసూలు చేశారు. ఇసుక ధరతోపాటు టీజీఎండీసీ సేవా రుసుముగా టన్నుకు రూ.35 చొప్పున రూ.1,225 తీసుకున్నారు. రోడ్డు డ్యామేజ్ చార్జీగా రూ.250, వెయి మెంట్ ఫీజుగా రూ.100ను కూడా రసీదులో నమోదు చేశారు. అంటే.. ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలన్నింటినీ కలిపితే వినియోగదారుడు చెల్లించాల్సిన మొత్తం ఎంత అన్నది రసీదులోనే స్పష్టం గా ఉంది. ఇంత పక్కాగా లెక్కలు ఉన్నప్పుడు.. రసీదు బయట మరో మొత్తాన్ని ఎందుకు చెల్లించాల్సి వస్తోందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

**రసీదులో ఒక లెక్క.. బయట మరో లెక్క?**

కోరేకల్ స్టాక్‌యార్డులో లారీకి ఇసుక లోడ్ చేసిన తర్వాత అదనంగా రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించిన వీడియోలు బయటకు రావడంతో ఆరోపణలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అదనపు వసూళ్ల ఆరోపణల్లో వాస్తవమెంతో తేల్చడం అధికారులకు పెద్ద కష్టమేమీ కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్టాక్‌యార్డులోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించడంతోపాటు లారీ ఎంట్రీ రిజిస్టర్, వెయిమెంట్ వివరాలు, రోజువారీగా జారీ చేసిన రసీదులు, ఇసుక విక్రయాల లెక్కలను సరిపోలిస్తే వాస్తవం బయటపడే అవకాశం ఉంది. ఒక లారీకి రసీదులో ఎంత చూపించారు? వాస్తవంగా ఎంత డబ్బు చెల్లించారు? అదనపు మొత్తం ఎవరికి ఇచ్చారు? నగదుగా ఇచ్చారా? డిజిటల్ చెల్లింపులు జరిగాయా? అన్న వివరాలను పరిశీలిస్తే వ్యవహారం తేలిపోతుంది. ముఖ్యంగా వీడియోల్లో కనిపిస్తున్న దృశ్యాలపై అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

# నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి









- **బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలను తిప్పికొట్టాలి**
- **కార్మికులు, రైతులు, ప్రజల హక్కులను హరిస్తున్న కేంద్రం**
- **జైల్‌భరోలో మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి**

కాకతీయ, ఖమ్మం : ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజల హక్కులను కాపాడేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖమ్మంలో నిర్వహించిన ఆందోళనలో ఆమె మాట్లాడారు. పరిషత్ సెంటర్ నుంచి టూ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఇల్లందు క్రాస్‌రోడ్‌లో రాస్తారోకో చేపట్టారు. పోలీసులు పలువురు నాయకులను అరెస్టు చేయగా, కార్మికులు, రైతులు స్వచ్ఛందంగా అరెస్టులకు సిద్ధమయ్యారు.

**29 చట్టాలను రద్దు చేసి..**

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారని చంద్రావతి విమర్శించారు. రోజువారీ పని సమయాన్ని 8 గంటల నుంచి 12 గంటలకు పెంచుకునే అవకాశం యాజమాన్యాలకు కల్పించడం, సమ్మె హక్కుపై ఆంక్షలు విధించడం, కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్‌ను కష్టతరం చేయడం, ఉద్యోగ భద్రతను దెబ్బతీయడం కార్మిక వ్యతిరేక చర్యలన్నారు. 300 మంది లోపు కార్మికులు పనిచేసే సంస్థల్లో నోటీసు లేకుండా తొలగించే విధానాన్ని అమలు చేయడం అన్యాయమన్నారు. రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, పంట రుణాలు, బీమా, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలను ఉపసంహరించుకోవాలని, నిరుపేద కుటుంబాలకు 35 కిలోల బియ్యం విధానాన్ని కొనసాగించాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకుని వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, గుమ్మడి నర్సయ్య, కళ్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణువర్ధన్, సి.వై. పుల్లయ్య, జి. రామయ్య, సింగు నరసింహారావు, తోట రామాంజనేయులు, యర్రా శ్రీనివాస్, మెరుగు సత్యనారాయణ, బోంతు రాంబాబు, మాదినేని రమేష్, వై. విక్రమ్, గోవిందరావు, వెంకన్న, నరాల నరేష్, ఆవుల అశోక్, పాషా, లక్ష్మీనారాయణ, శిరోమణి, బండి పద్మ, పి. రమ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక, రైతు సమస్యల పరిష్కారానికి రాస్తారోకో

- **కరకగూడెంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆందోళన**
- **కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్**
- **లేబర్ కోడ్‌లు, వీబీజీరామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్**



కాకతీయ, కరకగూడెం : కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరకగూడెం మండల కేంద్రంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. దీంతో మండల కేంద్రంలో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులకు భంగం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయడంతో పాటు స్కీం వర్కర్లను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం తీసుకురావాలని, వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను రద్దు చేసి రైతులకు ఎరువులు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీబీజీరామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు కొనసాగిస్తామని సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

# సుద్దాల చిన్నారి అరుదైన ఘనత

**ప్రకృతి బ్లెస్సీ.. 12 ఏళ్లకే ప్రపంచ రికార్డు**
**హై రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు**
**ప్రకృతి పరిరక్షణకు మూడు రాష్ట్రాల్లో 2.65 లక్షల విత్తనాలు**




కాకతీయ, కొనరావుపేట : మూడేళ్ల వయసులో విత్తనాలు సేకరించడం ప్రారంభించిన సుద్దాల చిన్నారి ప్రకృతి బ్లెస్సీ.. 12 ఏళ్లకే ప్రపంచ రికార్డు సాధించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ప్రకృతి ప్రకాష్ కుమార్తె, పద్మశ్రీ వనజీవి హరిత అవార్డు గ్రహీత ప్రకృతి బ్లెస్సీకి హై రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ప్రస్తుతం బద్దెనపల్లి గురుకులంలో ఏడో తరగతి చదువుతున్న ఆమె ప్రకృతి పరిరక్షణ కోసం చేసిన కృషికి ఈ గుర్తింపు దక్కింది. చిన్నతనం నుంచే చెట్లు, అడ వులు, పర్యావరణంపై ఆసక్తి పెంచుకున్న ప్రకృతి బ్లెస్సీ మూడేళ్ల వయసు నుంచే చెట్ల కింద రాలిన విత్తనాలను సేకరించింది. వాటిని మట్టితో కలిపి విత్తన బంతులుగా తయారు చేసి, తండ్రి ప్రకాష్ సహకారంతో డ్రోన్ల ద్వారా అటవీ ప్రాంతాల్లో చల్లుతూ పచ్చదనం పెంపునకు కృషి చేసింది.

**2.65 లక్షల విత్తనాలతో పచ్చని బాట**

తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతాల్లో ఇప్పటివరకు 2.65 లక్షల విత్తనాలు, విత్తన బంతులను వేసినట్లు తెలిపారు. చిన్న వయసులోనే ప్రకృతి పరిరక్షణకు ఇంతటి స్థాయిలో కృషి చేసినందుకు హై రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఆమెకు ఈ గుర్తింపు అందించింది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండూర్ స్టేడియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో హై రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను గ్రాండ్ మాస్టర్ ఎం. జయంత్‌రెడ్డి, సీఈవో సుమన్ పల్లె చేతుల మీదుగా ప్రకృతి బ్లెస్సీ అందుకుంది. తనకు లభిస్తున్న అవార్డులు, రికార్డులు ప్రకృతి సంరక్షణపై బాధ్యతను మరింత పెంచాయని ఆమె తెలిపింది. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. ప్రకృతి బ్లెస్సీ ఘనతపై బద్దెనపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ, మహతే దేవాయ ఫౌండేషన్ ప్రతినిధులు, సుద్దాల గ్రామ సర్పంచ్ కుంటెల్లి నాగరాజు, కొనరావుపేట మార్కెట్ చైర్మన్ కచ్చకాయల ఎల్లన్న అభినందనలు తెలిపారు.

## రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలి

**కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం రాస్తారోకో**



కాకతీయ, చేర్యాల : దేశ సంపదను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్లకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో డిమాండ్ చేశారు. చేర్యాల పాత బస్టాండ్ కూడలిలో సోమవారం కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించాలని కోరారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, విద్య, వైద్యం, ఉపాధి రంగాలను ప్రభుత్వ ఆధీనంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను తొలగించి పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగించాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి కూలీలకు రోజుకు రూ.800 వేతనం, ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని వెంకట మావో డిమాండ్ చేశారు. కార్పొరేట్ అనుకూల, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్రం ఉపసంహరించుకోకపోతే రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇబ్రహీం, బండకింది అరుణ్‌కుమార్, ఆముదాల నర్సిరెడ్డి, పోలోజు శ్రీహరి, బోయిని మల్లేశం, ముస్త్యాల ప్రభాకర్, నంగి మైసయ్య, ఆముదాల రంజిత్‌రెడ్డి, మోకు దేవేందర్‌రెడ్డి, నాగపురి కనకయ్య, జిడాల చంద్రయ్య, రేపాక కుమార్, గుండ్ర రవీందర్, పాల వెంకటేశం, పడిదం వీరమని, సౌభాగ్య, వెంకటలక్ష్మి, కనక లక్ష్మి, రజిత, సుశీల తదితరులు పాల్గొన్నారు.

**రామారావుపల్లిలో పిచ్చి మొక్కల తొలగింపు**

కాకతీయ, చందుర్తి: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామారావుపల్లిలో పిచ్చి మొక్కల నివారణకు గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. రహదారులు, ఖాళీ ప్రదేశాలు, నివాస ప్రాంతాల పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను గుర్తించి గడ్డి మందు పిచికారీ చేయించారు. గ్రామ సర్పంచ్ నారాగుల వాణి, గంగస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో దోమలు, కీటకాలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నట్లు పంచాయతీ ప్రతినిధులు తెలిపారు. గ్రామంలో పిచ్చి మొక్కల నివారణ, చెత్త తొలగింపు, పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## కారేపల్లిలో కదం తొక్కిన కార్మికులు

**నేతల అరెస్టులతో ఉద్రిక్తత.. జైల్‌భరోతో హోరెత్తిన కారేపల్లి**



కాకతీయ, కారేపల్లి: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం కారేపల్లిలో నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమం ఉద్రిక్తతల మధ్య కొనసాగింది. సీపీఐ(ఎం) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో, మానవహారం చేపట్టారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో కార్మికులు వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం పలువురు నేతలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఉపాధి హామీ చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థను పరిరక్షించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కే. నరేంద్ర, ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావు, కేశగాని ఉపేందర్, యనమనగండ్ల రవి, సురభాక ధనమ్మ, కొండబోయిన ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

===================

## బూత్ ఏజెంట్లకు అభినందనలు

- **ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో క్షేత్రస్థాయిలో కృషి**
- **అధికారులతో సమన్వయంతో ప్రక్రియ పూర్తి**
- **మండల, పట్టణ అధ్యక్షులు, బీఎల్ఏలకు కృతజ్ఞతలు**



కాకతీయ, ఖమ్మం టౌన్ : ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసిన కాంగ్రెస్ శ్రేణులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అభినందనలు తెలిపారు. ఏఐసీసీ ఆదేశాలు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ సూచనల మేరకు సంబంధిత శాసనసభ్యుల ఆమోదంతో నియమితులైన బూత్ లెవెల్ ఏజెంట్లు అధికారులతో సమన్వయం చేసుకుని ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1460 బూత్‌లకు గాను 1276 బూత్‌లలో 95 నుంచి 100 శాతం, 172 బూత్‌లలో 90 నుంచి 95 శాతం, 12 బూత్‌లలో 80 నుంచి 90 శాతం నమోదు పూర్తయిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన మండల, పట్టణ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ లెవెల్ సూపర్‌వైజర్లు, ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీకి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న మధిర ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లకు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి రాబోయే రోజుల్లోనూ సహకారం అందించాలని కోరారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266